ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం

- ప్రతి గ్రామంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహణ
- ఆర్‌పీఎఫ్ బలగాలతో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ



- వార్త 7వ పేజీలో..

కిక్కిరిసిన కల్యాణపులోవ



కల్యాణపులోవ రిజర్వాయర్‌లో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

మహా శివరాత్రి పవిత్ర స్నానాలకు తరలివచ్చిన భక్తులు

మహా శివరాత్రి జాగరణ చేసిన భక్తులంతా శనివారం ఉదయం కల్యాణపులోవ రిజర్వాయర్‌లో పుణ్య స్నానాలు ఆచరించారు. ఇక్కడి తిరునాళ్లకు భక్తజనం పోటెత్తారు. ఈ ప్రాంతమంతా శివనామ స్మరణతో మార్మోగింది. అలాగే అచ్యుతాపురం మండలంలోని పూడిమడక, తంతడి శివారు వాడపాలెంలోని సముద్ర తీరాలు భక్తులతో నిండిపోయాయి. పాయకరావుపేట మండలంలోని పెంటకోట, రాజవరం, పాల్మన్‌పేట సముద్ర తీరాల్లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరం భక్త జనంతో కిక్కిరిసిపోయింది.



పురోహితుడి ఆశీర్వచనం పొందుతున్న దంపతులు

సిట్టింగ్‌లకు లైన్ క్లియర్

సమన్వయకర్తలకు కూడా...

- ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల సమావేశంలో వైసీపీ అధిష్ఠానం సంకేతాలు
- చివరి నిమిషంలో ఒకటి, రెండు మార్పులు ఉండవచ్చునంటున్న నేతలు



విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైఎస్‌ఆర్ కాంగ్రెస్ తరపున వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులెవరనే దానిపై అధిష్ఠానం స్పష్టత ఇచ్చిందని పార్టీలో ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో తాడేపల్లిలో పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి వైవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో తూర్పు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, 'నార్త్' నుంచి కేకే రాజు, పశ్చిమ నియోజకవర్గం నుంచి సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, అనకాపల్లి నుంచి మలసాల భరత్‌కుమార్, పాడేరు నియోజకవర్గం నుంచి సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకులోయ నుంచి సమన్వయకర్త రేగం మత్స్యలింగంతోపాటు మిగిలిన నియోజక వర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలే (భీమిలి- ముత్తంశెట్టి శ్రీనివాసరావు, సౌత్- వాసుపల్లి గణేష్‌కుమార్, ఎలమంచిలి- కన్నబాబురాజు, నర్సీపట్నం-పెట్ల ఉమాశంకర్‌గణేష్, పెందుర్తి- అదీప్‌రాజ్) తిరిగి పోటీలో ఉంటారని అధిష్ఠానం సంకేతాలు ఇచ్చినట్టు పార్టీలో ప్రచారం జరుగుతోంది. అయితే చివరి నిమిషంలో ఒకటి, రెండు మార్పులు జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదని నేతలు పేర్కొంటున్నారు.

కలిసికట్టుగా...



టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య పొత్తు
వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ

- ఉమ్మడి విశాఖ జిల్లాలో సీట్ల సర్దుబాటుపై రకరకాల ఊహాగానాలు
- బీజేపీకే అరకులోయ ఎంపీ స్థానం
- అభ్యర్థిగా కొత్తపల్లి గీత పేరు పరిశీలన
- అనకాపల్లి ఎంపీ సీటు కూడా ఇస్తారనే ప్రచారం
- విశాఖపట్నం సీటు అడిగిన కమలనాథులు
- ఇవ్వలేమన్న టీడీపీ అధినేత
- అసెంబ్లీ స్థానాల్లో ఇప్పటికే జనసేనకు నాలుగు కేటాయింపు
- బీజేపీకి విశాఖ నార్త్?

(విశాఖపట్నం/అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీలు నిర్ణయించాయి. తాజాగా ఢిల్లీలో సీట్ల సర్దుబాటుపై చర్చలు పూర్తయ్యాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీని ఓడించడానికి మూడు పార్టీలు సమన్వయంతో పనిచేయాలని అంగీకారానికి వచ్చాయి. 2014 ఎన్నికల్లో ఎలాగైతే మూడు పార్టీలు కలిసి అధికారంలోకి వచ్చాయో ఇప్పుడు అదే పునరావృతం కావాలని బలంగా కోరుకుంటున్నాయి. మూడు పార్టీల మధ్య పొత్తు నేపథ్యంలో ఎవరెక్కడ పోటీ చేస్తారనే చర్చ విస్తృతంగా నడుస్తోంది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాలు విశాఖపట్నం, అనకాపల్లి, అరకు), 15 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిని ఎలా పంచుకోవాలి?...అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి.

పార్లమెంటు స్థానాలపై...

అరకులోయ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ ముందు నుంచి కోరుతోంది. గతంలో అక్కడ వైసీపీ నుంచి ఎన్నికైన కొత్తపల్లి గీత ఆ తరువాత కాలంలో ఆ పార్టీకి రాజీనామా చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీలో ఉన్నారు. ఆ స్థానం ఆమెకు ఇస్తారని ప్రచారం జరుగుతోంది. ఇక విశాఖపట్నం లోక్‌సభ స్థానాన్ని కూడా బీజేపీ కోరుకుంది. పార్టీ అధిష్ఠానం ఆదేశం పంపించిందని చెబుతూ రాజ్యసభ సభ్యుడు ఒకరు కొన్నాళ్లుగా ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే గతంలో విశాఖపట్నం ఎంపీగా గెలిచిన దగ్గుబాటి పురందేశ్వరి విశాఖ స్థానం కోరుకుంటారని ప్రచారం జరిగినా...ఆమె మాత్రం తనకు రాజమండ్రి కేటాయించాలని అధిష్ఠానాన్ని అడిగినట్టు సమాచారం. టీడీపీ నుంచి బీజేపీలోకి వెళ్లిన రాజ్యసభ సభ్యుల్లో రాయలసీమకు చెందిన ఒకరు విశాఖ నుంచి పోటీకి అవకాశం ఇవ్వాలని కోరినట్టు కూడా ప్రచారం జరిగింది. అయితే ఎట్టి పరిస్థితుల్లోను విశాఖపట్నం లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి ఇవ్వలేమని, గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయిన 'గీతం' అధ్యక్షులు శ్రీభరత్‌నే పోటీకి దించుతున్నామని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు...బీజేపీ పెద్దలకు చెప్పేశారు. దీంతో ఉమ్మడి విశాఖలో మరో ఎంపీ స్థానం ... మిగతా 8వ పేజీలో

5,650 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

- వ్యాపారిపై క్రిమినల్ కేసు నమోదు



గోదాముపై దాడి చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

బుచ్చెయ్యపేట, మార్చి 9: మండలంలోని గున్నెంపూడి గ్రామంలోని ఓ గోదాములో నిల్వ చేసిన 5,650 కిలోల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రేషన్ డిపో డీలర్ ముమ్మిడిశెట్టి సుజాత భర్త రమేశ్ పలువురి నుంచి పీడీఎఫ్ బియ్యాన్ని కొనుగోలు చేసి సబ్బవరం రైస్ మిల్లుకు విక్రయిస్తాడని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో నిఘా పెట్టిన విజిలెన్స్ సీఐ తిరుమలరావు, సీఎస్ డీటీ కె.ఈశ్వరరావు సిబ్బంది ఆకస్మాత్తుగా బియ్యం నిల్వ చేసిన గోదాముపై శనివారం దాడులు చేశారు. గోదాములో నిల్వ చేసిన 5,650 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యాన్ని రావికమతం స్టాక్ పాయింట్‌లో తూకం వేసి, సీఎస్ డీటీకి అప్పగించారు. రేషన్ బియ్యం నిల్వ చేసిన ముమ్మిడిశెట్టి రమేశ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశామని సీఎస్ డీటీ ఈశ్వరరావు తెలిపారు. అలాగే బుచ్చెయ్యపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్లు అప్పగింత!

టిడ్కో గృహ సముదాయాల్లో కనీస వసతులు శూన్యం

- టీడీపీ ప్రభుత్వ హయాంలో 60 శాతం పనులు పూర్తి
- వైసీపీ అధికారంలోకి వచ్చాక పనులు చేపట్టని వైనం
- ఎన్నికలు సమీపిస్తున్న వేళ హడావిడిగా లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేత
- వడ్డీలు కట్టాలని లబ్ధిదారులపై బ్యాంకు అధికారుల ఒత్తిడి
- ప్రభుత్వ తీరుపై విమర్శలు



బలిఘట్టంలో టిడ్కో ఇళ్లకు రహదారి సౌకర్యం లేని దృశ్యం

నర్సీపట్నం, మార్చి 9:


మునిసిపాలిటీలో టిడ్కో గృహ సముదాయాలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా హడావిడిగా లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అప్పగిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న కారణంగా రోడ్లు, తాగునీరు, విద్యుత్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకుండానే లబ్ధిదారులకు తాళాలు అప్పగిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 60 శాతం పైగా పనులు పూర్తి కాగా, వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో మిగిలిన 40 శాతం పనులు పూర్తి చేయలేదని, మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయిందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్

టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు నిర్మించడానికి బలిఘట్టం దత్తాత్రేయ ఆశ్రమం సమీపంలో 12 ఎకరాలు, కొత్త బయపురెడ్డిపాలెం- కసిమి రోడ్డులో 12 ఎకరాలు భూ సేకరణ చేశారు. మునిసిపాలిటీలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి 2,448 ఫ్లాట్లు మంజూరు చేశారు. 300, 360 చదరపు అడుగులు విస్తీర్ణంలో సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు, 430 చదరపు అడుగుల విస్తీర్ణంలో డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టి 60 శాతం పనులు పూర్తి చేసింది. టీడీపీ ప్రభుత్వం హయాంలో 1,480 మందికి, వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మరో 968 లబ్ధిదారులకు టిడ్కో గృహాల మంజూరు పట్టాలు ఇచ్చారు. వీటిలో పునాదుల స్థాయిలో ఉన్న 624 ఫ్లాట్లను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. ఫ్లాట్లు రద్దు చేసిన లబ్ధిదారులకు జగనన్న కాలనీలలో స్థలాలు కేటాయించింది. మిగిలిన 1,824 ఫ్లాట్లలో 384 సింగిల్ బెడ్ రూమ్ (300 చ.అ) ఫ్లాట్లుకు వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులకు బ్యాంకు రుణాలు రాయితీ ఇచ్చింది. మిగిలిన 1,440లో 144 ఫ్లాట్లు నిర్మాణంలో ఉన్నాయి. అవి పోను 1,296 ఫ్లాట్లుకు గాను 920 మంది లబ్ధిదారులకు బ్యాంక్ రుణాలు మంజూరు చేసి 800 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇళ్లు అప్పగించక పోతే ప్రతిపక్షాలకు ఆయుధంగా మారుతుందని భావించి 800 మందికి ఇంటి తాళాలు అప్పగించాలని ఎమ్మెల్యే నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. గత వారం రోజులుగా సచివాలయాల వారీగా కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జుల ద్వారా 670 మంది లబ్ధిదారులకు ... మిగతా 8వ పేజీలో

పది పరీక్షల నిర్వహణ బాధ్యతలపై నిరాసక్తత



గత ఏడాది ఇన్విజిలేషన్, జవాబు పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న 1120 మంది ఉపాధ్యాయులు

- వీరిలో 450 మందికి ఇప్పటికీ పారితోషికం అందని వైనం
- ఏడాదిగా డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం శూన్యం
- ఈ ఏడాది బాధ్యతలు నిర్వర్తించడానికి పలువురి విముఖత



అనకాపల్లిలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్, జవాబు పత్రాల మూల్యాంకనం(స్పాట్ వేల్యుయేషన్)కు చాలా మంది ఉపాధ్యాయులు సుముఖంగా లేరని తెలిసింది. ఎందుకంటే గత ఏడాది ఈ బాధ్యతలను నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో చెల్లింపులు జరగలేదు. దీంతో ఈ ఏడాది ఆ బాధ్యతలు చేపట్టేందుకు ఆసక్తి చూపడం లేదని సమాచారం.

పదో తరగతి పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి జిల్లాలో 108 కేంద్రాల్లో ప్రారంభం కానున్నాయి. 397 పాఠశాలల నుంచి 21,257 మంది రెగ్యులర్, 2,324 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షల నిర్వహణ విధులతో పాటు పరీక్షల అనంతరం ఇతర జిల్లాల నుంచి వచ్చిన జవాబు పత్రాలను (స్పాట్ వేల్యుయేషన్) మూల్యాంకనం విధుల్లో ఉపాధ్యాయులే పాల్గొనాల్సి ఉంటుంది. గత విద్యాసంవత్సరంలో జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణ విధుల్లో సుమారు 870 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జవాబు పత్రాల మూల్యాంకనం కార్యక్రమంలో మరో 250 మంది వరకు హాజరయ్యారు. వీరికి ప్రభుత్వం పరీక్షల్లో ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహిస్తే రోజుకు రూ.40, అదే విధంగా మూల్యాంకనంలో పాల్గొంటే రోజుకు 40 జవాబు పత్రాలు మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు ఒక పత్రానికి రూ.6 చొప్పున రోజుకు రూ.240 వంతున ప్రోత్సాహకంతో పాటు డీఏ రూ.40 చెల్లించాల్సి ఉంది. కాగా గత ఏడాది జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఒక అధికారి... ఉపాధ్యాయులకు సంబంధించిన బిల్లులు సక్రమంగా అప్‌లోడ్ చేయకుండా నిర్లక్ష్యం చేసినట్టు తెలిసింది. దీంతో జిల్లాలో సుమారు 450 మంది ఉపాధ్యాయులకు సంబంధించిన ఇన్విజిలేషన్ పారితోషికం, దీంతోపాటు మూల్యాంకనం విధులకు హాజరైన ఉపాధ్యాయులకు సంబంధించిన పారితోషికం, డీఏల చెల్లింపులు జరగలేదని సమాచారం. ఏడాది కాలంగా ఈ బకాయిలు ఎప్పుడొస్తాయని విధుల్లో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

గత ఏడాది బకాయిలు చెల్లించకుండానే..

పదో తరగతి పరీక్షల ఇన్విజిలేషన్ విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయుల వివరాలు ఇవ్వాలని మండల విద్యాశాఖాధికారులను ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు కోరారు. కాగా గత ఏడాది పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొన్నా ఇంత వరకు ప్రోత్సాహక పారితోషికం చెల్లించకపోవడంపై అసంతృప్తితో ఉన్న ఉపాధ్యాయులు ఈ ఏడాది పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొనేందుకు సుముఖంగా లేరని సమాచారం. దీనిపై డీఈవో ఎంవీ లక్ష్మమ్మను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా గత ఏడాది మార్చి నెలలో పరీక్షల విధుల్లో పాల్గొన్న కొంతమంది ఉపాధ్యాయులకు బిల్లులు ఫ్రీజింగ్ అయిన కారణంగా చెల్లింపులు జరగని మాట వాస్తవమేనన్నారు. గత ఏడాది పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు త్వరలోనే చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ ఏడాది పరీక్షల నిర్వహణ కోసం ఇన్విజిలేటర్ల నియామక ప్రక్రియ కొనసాగుతోందని, ఏ ఒక్క ఉపాధ్యాయుడు తాము విధుల్లో పాల్గొనేందుకు ఆసక్తిగా లేమని లిఖితపూర్వకంగా సమాచారం ఇవ్వలేదని తెలిపారు.

అధికార పార్టీ సేవలో ఆర్టీసీ

- మేదరమెట్ల సిద్ధం సభకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 బస్సులు
- రెండు రోజుల పాటు ప్రయాణికులకు ఇబ్బందులే

విశాఖపట్నం, మార్చి 9:

ప్రకాశం జిల్లా మేదరమెట్లలో ఆదివారం వైసీపీ నిర్వహించనున్న 'సిద్ధం' సభకు ఆర్టీసీ (ప్రజా రవాణా శాఖ...పీటీడీ) అధికారులు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 200 బస్సులను కేటాయించారు.

విశాఖపట్నం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 150, అనకాపల్లి రీజియన్‌లోని రెండు డిపోల నుంచి 50 బస్సులు ఇచ్చారు. ఈ బస్సులు శనివారం మధ్యాహ్నం నుంచి దశల వారీగా వెళ్లాయి. గుంటూరు, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలను, సాధారణ ప్రజానీకాన్ని తరలించేందుకు ఈ బస్సులు వినియోగించనున్నట్టు తెలిసింది. వైసీపీ నాయకులు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ బస్సులు ఆదివారం ఉదయానికి నిర్దేశిత ప్రాంతాలకు చేరుకుని, అక్కడ నుంచి మేదరమెట్ల సభకు జనాలను తరలించాలి. సభ ముగిసిన తరువాత పార్టీ శ్రేణులను తిరిగి వారి స్వస్థలాలకు చేర్చాలి. ఆ తరువాత అక్కడ నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి విశాఖపట్నం చేరుకుంటాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో శనివారం మధ్యాహ్నం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకూ రెండు వందల బస్సులు అందుబాటులో ఉండవు. ఆ ప్రభావం ప్రయాణికులపై పడనున్నది. ఆది, సోమవారాల్లో శుభకార్యాలకు ముహూర్తాలు ఉండడంతో ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి సమయంలో ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా ప్రత్యేక సర్వీసులు నడపాల్సిన పీటీడీ...ఉన్న బస్సులనే ఎక్కడో నాలుగు జిల్లాల అవతల జరుగుతున్న వైసీపీ సభలకు జనాలను తరలించేందుకు కేటాయించడం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ రవాణా శాఖ అధికార పార్టీ సేవలో తరించడం సరికాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భక్తజన తోవ.. కళ్యాణపులోవ

రెండో రోజు పోతురాజుబాబు దర్శనానికి పోటెత్తిన జనం

- శివరాత్రి జాగారం అనంతరం భారీగా తరలి రాక
- శివనామ స్మరణతో మార్మోగిన పరిసరాలు
- బస్సుల వద్ద తొక్కిసలాట.. పిల్లలు, వృద్ధులు విలవిల
- ట్రాఫిక్‌ను వన్‌వే చేయడంతో కాసేపు ఇబ్బందులు

రావికమతం, మార్చి 9: కళ్యాణపులోవ శనివారం కిటకిటలాడింది. మహా శివరాత్రి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్న వారంతా రాత్రి జాగరణ అనంతరం సముద్రాలు, జలాశయాలు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరిస్తుండడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మండలంలోని కళ్యాణపులోవకు అతి భారీగా తరలి వచ్చారు. తిరునాళ్ల రెండో రోజు వేకువజాము నుంచి ఎటుచూసినా జనసందోహమే కనిపించింది. తొలిరోజు శుక్రవారం ఈ ఏడాది ఆశించిన స్థాయిలో భక్తులు రాలేదు. అయితే మర్నాడు తిరునాళ్ల ప్రాంతాలు కిక్కిరిసిపోయి కనిపించారు. దీంతో ఆయా ప్రాంతాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఇక్కడి రిజర్వాయర్‌లో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం అంతా క్యూలో నిలిచి పోతురాజుబాబు, పెద్దింటమ్మవార్లను దర్శించుకున్నారు. కొందరు దంపతులు నిండు నూరేళ్ళు చల్లగా ఉండాలని పురోహితులతో బ్రహ్మ ముడులు వేసుకుని ఆపై దర్శనాలకు వెళ్లారు. మొదటి రోజు ఆశించిన స్థాయిలో భక్తులు లేరని భావించిన ఆర్టీసీ అధికారులు రెండో రోజు వాటి సంఖ్యను లోవకు తగ్గించారు. దీంతో బస్సులు చాలక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బస్సుల వద్ద తొక్కిసలాటలు చోటుచేసుకున్నాయి. పిల్లలు, వృద్ధులు విలవిల్లాడారు. ఇదిలావుంటే, కళ్యాణపులోవ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించకుండా కొత్తకోట సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను వన్ వే చేశారు. దీంతో ఉదయం పదకొండు నుంచి పన్నెండు గంటల మధ్య ములకలాపల్లి- కళ్యాణపులోవ మధ్యలో కొంత సమయం ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే బస్సులు, కార్లు మినహా, బైక్‌ల తిరుగు ప్రయాణం రూట్‌ను రిజర్వాయర్ కాలు గట్టుకు పోలీసులు మళ్లించి టి.అర్జాపురం శాస్త్రి మామిడి తోట వద్ద నుంచి బీఎస్ రోడ్డులోకి చేరేలా చేశారు. దీంతో సమస్య పరిష్కారమైంది. వివిధ శాఖలకు చెందిన సిబ్బందితో పాటు స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సేవలో తరించారు.


పోతురాజుబాబును దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే రాజు


భక్తులతో కిక్కిరిసిన రిజర్వాయర్ గట్టు ప్రాంగణం


బస్సు ఎక్కేందుకు భక్తుల అవస్థలు

క్రైం... crime news

వెంకటాపురంలో కూలిన సన్‌షేడ్

- నాయనమ్మ, మనవడికి గాయాలు


కూలిన సన్‌షేడ్ (అంతర్ చిత్రం) గాయపడిన బాలుడు సోహన్‌రవికుమార్, వరహాలమ్మ

ఎస్.రాయవరం, మార్చి 9: మండలంలోని వెంకటాపురంలో శనివారం ఒక ఇంటి సన్‌షేడ్ కూలి పోయిన ఘటనలో ఇద్దరికి గాయా లయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

వెంకటాపురంలో మరిసా విజయకుమార్, తన తల్లి, భార్య, ఇద్దరి పిల్లలతో శ్లాబ్ ఇంటిలో నివాసముంటున్నాడు. శనివారం తల్లి వరహాలమ్మ, మనవడు సోహన్ రవికుమార్(6) సన్‌షేడ్ కింద కూర్చున్నారు. అదే సమయంలో శ్లాబ్ సన్‌షేడ్ వారి పక్కనే కూలిపోయింది. దీంతో నాయనమ్మ, మనవడికి గాయాలయ్యాయి. గాయపడిన వారిద్దరిని తుని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్స పొందుతున్నారు. అదృష్టం బాగుండి వారి పక్క సన్‌షేడ్ కూలిందని, వారిపై పడితే ప్రాణాలు కోల్పోయి ఉండే వారని స్థానికులు తెలిపారు. ఆ సమయంలో మిగిలిన కుటుంబ సభ్యులు ఇంటిలోనే ఉన్నారు. వారంతా క్షేమంగా ఉన్నారు.

పేకాట ఆడుతున్న నలుగురి అరెస్టు

సబ్బవరం, మార్చి 9: మండలంలోని ఇరువాడలో శుక్రవారం రాత్రి పేకాట ఆడుతున్న నలుగురుపై కేసు నమోదు చేసినట్టు సీఐ పిన్నింటి రమణ తెలిపారు. ఇరువాడలోని ఒక ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేయగా.. నలుగురు యువకులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.20,360 నగదును స్వాధీనం చేసుకొని శనివారం కోర్టుకు తరలించినట్టు సీఐ రమణ తెలిపారు.

పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా విద్యా శాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ


వెంకన్నను దర్శించుకుంటున్న వెంకటలక్ష్మమ్మ

నక్కపల్లి, మార్చి 9 : జిల్లాలో టెన్త్ పరీక్షలకు సంబంధించి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని డీఈవో వెంకట లక్ష్మమ్మ చెప్పారు. శనివారం ఉదయం ఉపమాక వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గోత్ర నామాలతో అర్చకులు పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విలేకర్లతో ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 29వ తేదీ వరకూ టెన్త్ పరీక్షలు జరుగుతాయని, జిల్లాలో 21,756 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. ఇదిలావుంటే, వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారికి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేసి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. కింద ఆలయంలో ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవమూర్తులు,క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు,భాగవతం సాయిగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరుకు చెందిన ప్రముఖ రచయిత్రి బి.గీతిక స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి టీడీపీ కార్యకర్తల ఆందోళన

- సీటు జనసేనకు కేటాయించడంపై అభ్యంతరం
- రెండు, మూడు రోజుల్లో పార్టీ అధినేతను కలుస్తామని సర్దిచెప్పిన నేతలు
- టీడీపీకే కేటాయించాలంటూ తీర్మానం
- అధిష్ఠానం నిర్ణయం శిరోధార్యమన్న పార్టీ ఇన్‌చార్జి 'ప్రగడ'


సమావేశంలో నిరసన వ్యక్తంచేస్తున్న కార్యకర్తలు

ఎలమంచిలి, మార్చి 9 : జిల్లాలోని ఎలమంచిలి సీటు జనసేనకు ఇవ్వడం పట్ల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ మంత్రి, సీనియర్ నేతల పప్పల చలపతిరావు, తదితరులు వారిని శాంతింపజేశారు. పొత్తులో భాగంగా ఎలమంచిలి టికెట్ జనసేనకు ఇస్తున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో శనివారం పట్టణంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రగడ నాగేశ్వరావు మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నుంచి తనకు, పెద్దలు పప్పల చలపతిరావుకు ఫోన్ వచ్చిందని, పొత్తులో భాగంగా ఎలమంచిలి సీటు జనసేనకు కేటాయించినట్టు తెలిపారన్నారు. స్థానిక పరిస్థితులను చంద్రబాబుకు వివరించామని, అయితే అధిష్ఠానం నిర్ణయమే తనకు శిరోధార్యమని ప్రగడ అన్నారు. అనంతరం మాజీ మంత్రి పప్పల చలపతిరావు మాట్లాడుతుండగా గెలిచే సీటును ఎందుకు వదిలేశారంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తూ పోడియం వద్దకు వచ్చేందుకు యత్నించారు. ఈ సమయంలో కొందరు కుర్చీలు విసిరేశారు. ఎలమంచిలి సీటు టీడీపీకే కేటాయించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రగడ వారిని శాంతింపజేసేందుకు యత్నించారు. నేతలు, కార్యకర్తలు సంయమనం పాటించాలని, అధిష్ఠానం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కోరారు. అనంతరం ఆడారి మంజు, రాజాన నారాయణమ్మ, దూలి రంగనాయకులు, గొర్లె నానాజీ తదితర నేతలు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లపాటు పార్టీ కోసం శ్రమించిన ప్రగడకు టికెట్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ తెలుగుదేశం ఆవిర్భావం తరువాత తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగ్గా.. ఆరుసార్లు పార్టీ అభ్యర్థి విజయం సాధించినట్టు తెలిపారు. పార్టీకి ఎనలేని పట్టు ఉన్న నియోజకవర్గం గురించి అధిష్ఠానానికి మరోమారు తెలియపరుస్తామన్నారు. రెండు రోజుల్లో చంద్రబాబునాయుడు కలుస్తామని, కార్యకర్తలంతా సంయమనంతో ఉండాలని కోరారు. అనంతరం ఎలమంచిలి సీటు టీడీపీకు కేటాయించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- రూ.2.36 లక్షల కోట్లు బటన్ నొక్కుడు సరే.. మిగిలిన రూ.పది లక్షల కోట్లు ఏమయ్యాయి?
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత రూ.12 లక్షల కోట్లు పైబడి అప్పులు తెచ్చారని, ఈ మొత్తంలో ఇప్పటివరకు సంక్షేమ కార్యక్రమాల కోసం రూ.2.36 లక్షల కోట్లు బటన్ నొక్కి పంపిణీ చేశామని జగన్ రెడ్డి చెబుతున్నారని, మిగిలిన రూ.10 లక్షల కోట్లు దేనికి ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి తనను తాను దైవ సంభూతుడిగా, పెత్తందారుగా ఊహించుకుంటున్నారని విమర్శించారు. సంక్షేమానికి వారధినని చెప్పుకునే జగన్ వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులు, పాస్టర్లకు, తుదకు ఓటర్లకు సైతం ప్యాంట్లు, చొక్కాలు, చీరలు, కుక్కర్లు, సెల్‌ఫోన్లు, టీ కప్పులు ఇలాంటి చిల్లర తాయిలాలతో ఎరవేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు జగన్‌పై నమ్మకం లేదుకాబట్టే తాయిలాలు ఇవ్వడం మొదలు పెట్టి ఓట్ల కోసం ఎరవేస్తున్నారన్నారు. ఓట్లు వచ్చే మార్గం ఎన్నుకోవడం వలనే ఒక రాజధాని నిర్మించడం, రోడ్లు వేయడం, ఫ్యాక్టరీలు కట్టడం అనవసరమని, అవి ఓట్లు తెచ్చేవికాదన్న భావంతో జగన్‌రెడ్డి ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రం కోలుకోలేని విధంగా అప్పులు చేసి, కేవలం పంచడం కోసమే ప్రభుత్వం ఉందన్న భావనను ప్రజల్లోకి తీసుకెళ్లారని విమర్శించారు. సంపద సృష్టించడం చేతకాక అభివృద్ధిని గాలికి వదిలేస్తే ప్రజలు ఉప్పెనలా ఎగిసిపడి వైసీపీని సమాధి చేస్తారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కడిమిశెట్టి నరసింగరావు, కె.జగన్, బి.వెంకటరావు, బి.మురళి తదితరులు పాల్గొన్నారు.

కేడర్ సంయమనం కోల్పోవద్దు

రాష్ట్రంలో వైసీపీ పాలన అంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకుంటున్నాయని జగదీశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి అధినేతలు టికెట్ల కేటాయింపులు, మార్పు చేర్పుల విషయంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకున్నా కేడర్ ఏ ఒక్కరూ సంయమనం కోల్పోయి వ్యవహరించరాదన్నారు. అధినేత చంద్రబాబును సీఎం చేయడమే అందరి లక్ష్యంగా పనిచేయాలని బుద్ద కోరారు.

ఇంటర్ పరీక్షలకు 13,770 మంది హాజరు

అనకాపల్లి టౌన్, మార్చి 9: జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం మాథ్స్-1బి, జువాలజీ-1, హిస్టరీ-1 పరీక్షకు 13,770 మంది విద్యార్థులు హాజరయ్యారని ఇంటర్‌బోర్డు జిల్లా అధికారిణి సుజాత తెలిపారు. 14,313 మందికి 542 మంది హాజరు కాకపోవడంతో 13,770 మంది పరీక్షలకు హాజరయ్యారని వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం

- అందరి లక్ష్యం ఇదే కావాలి
- ఆర్‌పీఎఫ్ బలగాలతో ఎస్పీ మురళీకృష్ణ


కేంద్ర బలగాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

చోడవరం, మార్చి 9: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. అనకాపల్లి జిల్లాకు కేటాయించిన బీహార్ ఆర్‌పీఎఫ్ బలగాలకు పట్టణంలోని చీడికాడ రోడ్డులో గల చైతన్య బీఈడీ కళాశాల వద్ద వసతి సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం ఇక్కడికి విచ్చేసిన ఎస్పీ కేంద్ర బలగాలను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలు సాధిద్దామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడంతో పాటు, వాహన తనిఖీలు, పెట్రోలింగ్ తదితర విధులన్నీ ఎన్నికలయ్యేంత వరకూ కేంద్ర బలగాలు నిర్వహిస్తాయన్నారు. కేంద్ర బలగాల అవసరాల కోసం ప్రత్యేకంగా లైజనింగ్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లాలో పరిస్థితులపై కేంద్ర బలగాలకు ఎస్పీ అవగాహన కల్పించారు. అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీ ఎస్.అప్పలరాజు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌పీఎఫ్ కమాండర్ జగదీశ్‌రాజ్, చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే మెదడు, వెన్నెముక లోపాల నివారణ

- ఫోలిక్ యాసిడ్ పోర్టిఫైడ్ అయోడైజ్డ్ సాల్ట్ వినియోగంతో సాధ్యం
- ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

విశాఖపట్నం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గర్భం దాల్చడానికి ముందు నుంచీ మహిళలు ఫోలిక్ యాసిడ్ పోర్టిఫైడ్ అయోడైజ్డ్ సాల్ట్ వినియోగించినట్టయితే పుట్టుకతో చిన్నారుల్లో కనిపించే మెదడు, వెన్నెముక లోపాలను నివారించవచ్చునని ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు అన్నారు. ఈ విషయం తమ వైద్య బృందం చేసిన పరిశోధనలో తేలిందన్నారు. శనివారం ఉదయం ఆంధ్ర మెడికల్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పరిశోధన వివరాలను ఆయన వెల్లడించారు. మెడికల్ కళాశాల పరిధిలోని న్యూరోసర్జరీ విభాగానికి చెందిన బృందం, జాతీయ, అంతర్జాతీయ వైద్యులతో కలిసి పుట్టుకతో వచ్చే మెదడు, వెన్ను అవకారాలపై పరిశోధన సాగించిందన్నారు. గర్భం దాల్చడానికి కొద్దిరోజుల ముందే మహిళలకు ఫోలిక్ యాసిడ్ కలిపిన పోర్టిఫైడ్ సాల్ట్ ఇవ్వడం ద్వారా ఆతరహా సమస్యలకు చెక్ చెప్పవచ్చునని తేలిందన్నారు. ఈ విషయం జర్నల్ ఆఫ్ అమెరికన్ మెడికల్ అసోసియేషన్ నెట్‌వర్క్ ఓపెన్ అనే పబ్లికేషన్ ప్రచురించిందన్నారు. ఫోలిక్ యాసిడ్ లోపం వల్ల శిశువుల్లో నాడీ సంబంధమైన సమస్యలు ఉత్పన్నం కావడంతోపాటు మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ఈ పరిశోధనను అల్లూరి సీతారామరాజు జిల్లాలోని నాలుగు గ్రామాల్లో 1,200 మంది మహిళలపై సాగించినట్టు తెలిపారు. నాలుగు నెలలపాటు ఫోలిక్ యాసిడ్ పోర్టిఫైడ్ అయోడైజ్డ్ సాల్ట్‌ను వారికి అందించడం జరిగిందన్నారు. ఈ ఉప్పు తీసుకున్న వారిలో ఫోలిక్ యాసిడ్ స్థాయిలు రక్తంలో గణనీయంగా పెరిగాయని, దీనివల్ల ఆయా వ్యాధుల ప్రమాదం తగ్గిందన్నారు. ఈ అధ్యయనం దేశ, విదేశాల నుంచి వచ్చిన నిపుణుల బృందం డాక్టర్ ఎంవీ విజయ శేఖర్, డాక్టర్ బి.హయగ్రీవరావు, ఫణి మాధవి, అనిల్‌కుమార్, యూఎస్ఏ కాలేజ్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన డాక్టర్ జోగి వి పట్టిసాపు, ఎమోరీ విశ్వవిద్యాలయం డాక్టర్ గాడ్ పీఓకే, విజయ కంచర్ల ఆధ్వర్యంలో సాగిందన్నారు. సమావేశంలో డాక్టర్ విజయశేఖర్, ప్రాజెక్ట్ సమన్వయకర్త కె.మధునారాయణరావు (అనిల్) పాల్గొన్నారు.

ఆహ్వానపు వాలీబాల్ పోటీల విజేత గాజువాక


మొదటి బహుమతి విజేత గాజువాక సభ్యులకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి టౌన్, మార్చి 9 : స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో రెండు రోజులుపాటు జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు శుక్రవారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో గాజువాక జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. వీరికి రూ. 15వేలు, ద్వితీయ స్థానం దక్కించుకున్న ఆదిరెడ్డిపాలెం జట్టుకు రూ.10 వేలు, తృతీయస్థానం దక్కించుకున్న అనకాపల్లి జట్టుకు రూ.ఆరు వేలు, జ్ఞాపికను నిర్వాహకులు యల్లపు గోవింద, పీలా రమణారావు, బుద్ద శివ, భీమరశెట్టి లక్ష్మీనారాయణ అందజేశారు. ముగింపు కార్యక్రమానికి ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ హాజరై వాలీబాల్ నిర్వహణ కమిటీ కన్వీనర్ యల్లపు గోవింద్‌ను సత్కరించారు. అలాగే వ్యక్తిగత బహుమతులను గౌరీ వ్యాయామశాల అధ్యక్షుడు కొణతాల అప్పలనాయుడు క్రీడాకారులకు అందజేశారు. ఈ ఏడాదిలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని రఘునాథ్ చెప్పారు. పోటీల నిర్వాహకులు విల్లూరి ప్రసాద్, పెంటకోట చిన్న, దాడి ఈశ్వరరావు, బీశెట్టి శ్రీనివాసరావు, రాపేటి సీతారాం, రిపరీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

తీరాలకు పోటెత్తిన భక్తులు

» జాగారాలు చేసిన భక్తజనం.. » వేకువ జాము నుంచి పుణ్య స్నానాలు » సమీప ఆలయాల్లో పూజలు


పరవాడ: ముత్యాలమ్మపాలెం తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పరవాడ, మార్చి 9 : మండలంలోని ముత్యాలమ్మపాలెం తీరానికి శనివారం భక్తులు పోటెత్తారు. శివరాత్రి జాగారం అనంతరం పుణ్య స్నానాలు ఆచరించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. దీంతో తీర ప్రాంతమంతా భక్తులతో కోలాహలంగా మారింది. అనంతరం తీరంలో కొలువైన రామలింగేశ్వరస్వామికి పూజలు చేపట్టారు. భక్తుల రద్దీ కారణంగా ముత్యాలమ్మపాలెం జంక్షన్ నుంచి తీరానికి వెళ్లే ప్రధాన రహదారి అంతా పూర్తిగా కిక్కిరిసింది. దీనివల్ల రాకపోకలు సాగించే వారంతా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. తీరంలో వసతి సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎక్కడా సముద్ర ఘట్టాలు ఏర్పాటు చేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. విశ్వహిందూపరిషత్ కమిటీ సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు అన్నెం బాబ్జి, కె. శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని పెంటకోట, రాజవరం, పాల్మన్‌పేట సముద్ర తీరాల్లో శనివారం భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు జాగారం చేసి పాల్మన్‌పేట తీరంలో తుని, కోటనందూరు, పాయకరావుపేట మండలాల నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు, పాయకరావుపేట స్టేషన్ సిబ్బంది గస్తీ నిర్వహించారు.


పాయకరావుపేట రూరల్: పెంటకోటలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

అచ్యుతాపురంలో.. మహాశివరాత్రి పురస్కరించుకొని జాగారం చేసిన భక్తులు శనివారం ఉదయం పూడిమడక, వాడపాలెం తీరాల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. పుణ్య స్నానాలు చేసిన భక్తులు పూడిమడక తీరంలో జగన్నాథస్వామి, ఆంజనేయస్వామి, వాడపాలెం తీరంలోని శ్రీకృష్ణ ఆలయాల్లో భక్తులు దర్శనాలు చేసుకున్నారు.

ఎస్.రాయవరంలో.. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి జాగారం చేసిన భక్తులు శనివారం రేవుపోలవరం తీరంలో పుణ్య స్నానాలు ఆచరించారు. అధికంగా భక్తులు రావడంతో తీరం కిటకిటలాడింది.


అచ్యుతాపురం: వాడపాలెం తీరంలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

రాంబిల్లిలో.. మహాశివరాత్రి జాగారం చేసిన భక్తులు శనివారం పంచదార్ల పుణ్యక్షేత్రంలో ఆకాశధార వద్ద, వాడరాంబిల్లి, లోవపాలెం, వెంకయ్యపాలెం సముద్రతీరాల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. పంచదార్లలోని రాధామాధవస్వామి ఆలయంలోని ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఫణిగిరిపై వెలసిన ధర్మలింగేశ్వరస్వామిని దర్శించి పూజలు చేశారు. వాడపాలెం, లోవపాలెం, వెంకయ్యపాలెం సముద్రతీరాల్లో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఆయా తీరాల వద్ద వెలసి ఉన్న గంగాదేవిని దర్శించి పూజలు చేశారు. ప్రధానంగా పంచదార్ల, దిమిలి, కట్టుబోలు, లాలంకోడూరు, కొత్తపట్నంలోని శివాలయాలను భక్తులు దర్శించి పూజలు చేశారు.


ఎలమంచిలి- గాజువాక రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

భక్తుల తాకిడికి ట్రాఫిక్‌కు అంతరాయం

ఎలమంచిలి-గాజువాక రోడ్డులో గంట సేపు నిలిచిన వాహనాలు

పరవాడ, మార్చి 9 : ముత్యాలమ్మపాలెం తీరానికి శివరాత్రి జాగారం స్నానాలు చేసేందుకు భక్తులు తాకిడి అధికమైంది. ఈ కారణంగా ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారిలో శనివారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక టీ రాజా హోటల్ నుంచి ఊటగెడ్డ జంక్షన్ వరకు, ఇటువైపు సినిమాహాల్ జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ముత్యాలమ్మపాలెం తీరానికి వెళ్లే భక్తులంతా ఇదే రహదారి గుండా వెళ్తూ ఊటగెడ్డ జంక్షన్ నుంచి ఎడమ వైపు ఉన్న సింహాద్రి ఎన్టీపీసీ, వాడచీపురుపల్లి మీదుగా ముత్యాలమ్మపాలెంకు చేరుకుంటారు. అయితే భక్తులు అధికసంఖ్యలో రావడంతో ఊటగెడ్డ జంక్షన్ నుంచి పరవాడ సినిమాహాల్ జంక్షన్ మధ్య వాహనాలు నిలిచిపోయాయి. దీనివల్ల రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. సుమారు గంటకు పైగా పోలీసులు కష్టపడాల్సి వచ్చింది. ట్రాఫిక్ వల్ల అచ్యుతాపురం, ఎలమంచిలి, గాజువాక వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

భద్రతే కార్మికులకు భరోసా

» సింహాద్రి ఓఅండ్‌ఎం జీఎం సురేష్‌జాన్ డేవిడ్



బహుమతులు అందజేస్తున్న సింహాద్రి ఓఅండ్‌ఎం జీఎం సురేష్‌జాన్ డేవిడ్

పరవాడ, మార్చి 9 : పరిశ్రమల్లో కార్మికులకు సరైన భద్రత కల్పించడమే వారికి భరోసాగా నిలుస్తుందని సింహాద్రి ఎన్టీపీసీ ఓఅండ్‌ఎం విభాగం జీఎం సురేష్‌జాన్ డేవిడ్ అన్నారు. శనివారం ప్లాంట్ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. భద్రతా వారోత్సవాల్లో భాగంగా కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారి చిన్నారావు, సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు టీఆర్ రాజగోపాలన్, పద్మప్రియ, బీబీ పాత్ర పాల్గొన్నారు.

120 మంది ఉపాధి కూలీలకు వస్త్రాలు పంపిణీ


ఉపాధి పథకం వేతనదారులకు వస్త్రాలు అందజేస్తున్న సర్వేశ్వరరావు

రాంబిల్లి, మార్చి 9 : మండలంలోని లాలంకోడూరులో శనివారం 120 మంది ఉపాధి కూలీలకు జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కోరెడ్డి సర్వేశ్వరరావు చీరలు, తువ్వాళ్లు, గ్లాసులను అందజేశారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు జాగ్రత్తలు తీసుకుంటూ పనులు చేసుకోవాలన్నారు. సెజ్‌లోని కంపెనీలకు లాలంకోడూరు అతి సమీపంలో ఉండడంతో కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తనకు ఉన్నంతలో సేవా కార్యక్రమాలు చేస్తున్నానన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉపాధి కూలీలకు మెండుగా మేలు జరుగుతుందని సర్వేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఉరిటి నానాజీ, చట్టా చంద్రశేఖర్ రెడ్డిమి వాసు, లాలం పెదగంగరాజు, రాజా, నర్సింగ్, మాధవ్ ఉపాధి వేతనదారులు ఉన్నారు.

ఉమెన్ హాకీ టోర్నీలో ఫైనల్‌కు చేరిన జిల్లా జట్టు


అంతర్ జిల్లాల సీనియర్ ఉమెన్ హాకీ టోర్నీలో ఫైనల్‌కు చేరిన జిల్లా జట్టు

ఎలమంచిలి, మార్చి 9: ఒంగోలులో జరుగుతున్న 14వ సీనియర్ ఉమెన్ అంతర్ జిల్లాల హాకీ టోర్నీలో జిల్లా జట్టు ఫైనల్‌కు చేరినట్టు హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొఠారు నరేష్ తెలిపారు. శనివారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో అనకాపల్లి జట్టు విశాఖ జట్టుపై 1-0 తేడాతో విజయం సాధించి, ఫైనల్‌కు చేరిందన్నారు. ఇరు జట్లు మధ్య హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో మడగల భవానీ గోల్ చేసి అనకాపల్లి జట్టును విజయపథంలో నడిపించిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఫైనల్ విజేతగా నిలవాలని సంఘ అధ్యక్షుడు వీరునాయుడు ఆకాంక్షించారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సబ్బవరం, మార్చి 9 : స్థానిక కేజీబీవీలో 2024-25 సంవత్సరానికి ఆరో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌వో మృదుల తెలిపారు. అదేవిధంగా 7,8,9 తరగతుల్లో మిగిలి న్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో 40 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరం (ఎంపీసీ) 40 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

అనిత సమక్షంలో టీడీపీలో చేరికలు

పాయకరావుపేట రూరల్/నక్కపల్లి, మార్చి9 : మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన 50 కుటుంబాల వారు టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత సమక్షంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. సత్యవరం గ్రామానికి చెందిన ఎస్.కొండబాబు, ముత్యాలు, కాకాడ అప్పారావు, కండెళ్ల నాగేశ్వరరావు, తుమ్మలపల్లి రాంపండు, గోవిందు, గంపల సూకరాజు, వేమగిరి అప్పారావు, వేమగిరి కొండబాబు, గంపల సత్తిబాబు తదితర 50 కుటుంబాలు పార్టీలో చేరగా మాజీ ఎమ్మెల్యే అనిత వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు వడ్డాది వాసు, ఏనుగు చిన్నా, కంకిపాటి వెంకటేశ్వరరావు, కూండ్రపు గుర్రాజు, కూలి నానాజీ, తంపా వెంకటేశ్వరరావు, కూండ్రపు కృష్ణ, సీకోలు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.


అనిత సమక్షంలో టీడీపీలో చేరిన ఇతర పార్టీల కార్యకర్తలు


విజేతలకు నగదు అందజేస్తున్న దృశ్యం

జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ విజేత పరవాడ

కొత్తూరు, మార్చి9: మహాశివరాత్రి సందర్భంగా పిసినికాడలో జరిగిన జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పరవాడ జట్టు ప్రథమ స్థానం సాధించింది. పంచపాండవులు ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జిల్లా మారుమూల ప్రాంతాల నుంచి 30 జట్లు పాల్గొన్నాయి. వీటిలో పరవాడ జట్టు ప్రథమ స్థానం సాధించారు. మొదటి బహుమతి రూ.5వేలు చంద్రశేఖర్, ద్వితీయ బహుమతి అనకాపల్లికి చెందిన సాయికి రూ.4వేలు, తృతీయ బహుమతి పిసినికాడకు చెందిన మహేంద్రజగదీష్‌కు రూ.3వేలు అందజేశారు.

52 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆట వస్తువులు పంపిణీ

కొత్తూరు, మార్చి 9: జిల్లా వ్యాప్తంగా ఉన్న 52 అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.21.94 లక్షలు ఎంపీ నిధులతో ఆట వస్తువులను సమకూర్చినట్టు అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి తెలిపారు. శనివారం అనకాపల్లి మండలంలోని వెంకుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆట వస్తువులను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల్లో మానసిక ఉల్లాసానికి ఆటలు తప్పనిసరిగా ఉండాన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒక్కో కేంద్రానికి రూ.42వేలు చొప్పున ఆట వస్తువులు అందజేశామన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి, ప్రాజెక్టు డైరెక్టర్ అనంతలక్ష్మి పాల్గొన్నారు.


ఆట వస్తువులను ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి

137వ రోజుకు పెదకలవలాపల్లి రైతుల నిరసన

రాంబిల్లి, మార్చి 9 : తమ తమ సమస్యలను పరిష్కరించాలని పెదకలవలాపల్లి రైతులు చేస్తున్న నిరసన దీక్ష శనివారం నాటికి 137వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, డీవైఎస్‌ఐ నేత రాములు దీక్షా శిబిరాన్ని సందర్శించి, వారికి తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా దేముడునాయుడు మాట్లాడుతూ రైతులకు ప్రత్యామ్నాయ రహదారి చూపించకుండా దారులను మూసివేసి ప్రహరీగోడ నిర్మాణం చేపట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముళ్ల, మహిళా రైతులు ఉన్నారు.

శివ నామస్మరణతో హోరెత్తిన శివాలయాలు

అనకాపల్లి రూరల్, మార్చి 9 : హరిహర మహదేవ.. శంభో శంకర అంటూ శివ నామస్మరణతో మండలంలోని శివాలయాలు శనివారం హోరెత్తాయి. కొప్పాక, శీరంశెట్టివానిపాలెం శివాలయాలకు వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా తరలి వచ్చి శివునికి పూజలు చేశారు. కొంతమంది సభ్యులు శివాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

ఎలమంచిలి రైలు గేటు మూసివేత



మూసివేసి ఉన్న ఎలమంచిలి(కొక్కిరాపల్లి) రైల్వే గేటు

ఎలమంచిలి, మార్చి 9: ఎలమంచిలి(కొక్కిరాపల్లి) రైల్వే గేటును మూసివేసినట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. రైల్వే గేటు మూసివేసినట్టు రెండు వైపులా ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 29వ తేదీన ఫ్లై ఓవర్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చింది. సమస్య తీరడంతో రైల్వే గేటును మూసివేసినట్టు తెలిసింది. ఈ విషయాన్ని రైల్వే గేటు సిబ్బందిని అడుగ్గా.. రెండు రోజుల నుంచి గేటును అధికారులు మూసివేయించారని తెలిపారు.

కలిసికట్టుగా...

... 5వ పేజీ తరువాయి

ఇవ్వాలని బీజేపీ కోరినట్టు, అలాగైతే జనసేనకు అనుకున్న అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి బదిలీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ అలా జరిగితే అనకాపల్లి నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు, సీఎం రమేశ్‌ల పేర్లు పరిశీలిస్తున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే ఆ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవీఆర్) పేరు కూడా బీజేపీ అధిష్ఠానం పరిశీలనలో ఉందని ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి స్థానానికి మొదట జనసేన తరపున నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఆయన కూడా నియోజకవర్గంలో తిరిగారు. ఎందుకనో ప్రచారం ఆపేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకి ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే అంటున్నారు.

అసెంబ్లీ స్థానాల సర్దుబాటు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీతో పొత్తు కుదరక ముందే అందులో జనసేన పార్టీకి నాలుగు ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి/మాడుగుల స్థానాలు కేటాయించారు. అక్కడ అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయిపోయినట్టే. అనకాపల్లికి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలికి సుందరపు విజయకుమార్, పెందుర్తి పంచకర్ల రమేశ్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. విశాఖ జిల్లాకు వచ్చేసరికి దక్షిణం సీటు జనసేనకు ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు బీజేపీ కూడా కొన్ని అసెంబ్లీ స్థానాలు కోరుతోంది. గతంలో 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేసినప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీ చేయడానికి ప్రచారం కూడా ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలో బీజేపీకి ఏమైనా అసెంబ్లీ స్థానాలు ఇచ్చినట్టయితే అందులో మొదటిది విశాఖ ఉత్తర నియోజకవర్గమే అవుతుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. బీజేపీలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, బీజేపీ యువమోర్చా నాయకుడు సురేంద్రమోహన్ వంటివారు ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇంకా ఏమైనా అదనంగా అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తే వారిలో ఎవరికైనా ఛాన్స్ దక్కవచ్చు.

అసంపూర్తి ఇళ్లు అప్పగింత!

... 5వ పేజీ తరువాయి

తాళాలు అప్పగించారు. మిగిలి 130 మందికి కూడా తాళాలు అప్పగించే పనిలో కౌన్సిలర్లు ఉన్నారు.

366 మంది పరిస్థితి ఏమిటో?

1,296 ఫ్లాట్లుకు గాను 920కి బ్యాంకు రుణాలు మంజూరు అయ్యాయి. మిగిలిన 376 మందిలో పది మంది లబ్ధిదారులు బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా యూనిట్ ధర సొమ్ము ఒకేసారి కట్టుకోవడానికి ముందు వచ్చారు. ఈ పది మంది పోగా మిలిగిన 366 మంది లబ్ధిదారులలో సిబిల్ స్కోర్ సమస్య, 60 ఏళ్లు పైబడిన లబ్ధిదారులు, స్పందించనివారు ఉన్నారు. 60 ఏళ్లు పైబడిన లబ్ధిదారుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను లబ్ధిదారులుగా చేర్చడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. వీరిలో చాలా మంది లబ్ధిదారులు పేర్లు జాబితాలో ఉన్నాయి గాని ఇళ్లు తీసుకోవడానికి ముందుకు లేదని అధికారులు అంటున్నారు.

మౌలిక సదుపాయాలు శూన్యం

టిడ్కో ఇళ్లు నిర్మాణం పూర్తి చేసినప్పటికీ వాటర్ ట్యాంక్, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు పూర్తి కాలేదు. కొత్త బయపురెడ్డిపాలెం- కసిమి రోడ్డులోని టిడ్కో గృహాల వద్ద రోడ్లు, డ్రైనేజీ పనులు చాలా వరకు పూర్తి చేశారు. ఇక్కడ ప్రధాన రహదారిని కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్, విద్యుత్, వాటర్ ట్యాంక్ సదుపాయాలు కల్పించాలి. బలిఘట్టంలోని టిడ్కో గృహాల వద్ద రోడ్లు నిర్మాణాలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్, వాటర్ ట్యాంకు పనులు పూర్తి కాలేదు.

వడ్డీలు కట్టాలని లబ్ధిదారులపై ఒత్తిడి

టిడ్కో గృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగడం లబ్ధిదారులకు శాపంగా మారింది. బ్యాంక్ రుణాలు మంజూరు అయిన లబ్ధిదారులు వాయిదాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. రెండేళ్ల మారిటోరియం కాల వ్యవధి పూర్తి కావడంతో లబ్ధిదారులు వడ్డీలు చెల్లించాలని అంటున్నారు. ఒక్కొక్కరికి రూ.30 వేలు నుంచి రూ.40 వేలు వరకు వడ్డీలు పేరుకుపోయాయి. ఇళ్ల తాళాలు తీసుకుంటున్న లబ్ధిదారులు బ్యాంకులకు వడ్డీలు కట్టాల్సి రావడంతో ఇంతకాలం ఇళ్లు అప్పగించకుండా బ్యాంకు రుణాలు వాయిదాలు చెల్లించమంటే తామెందుకు చెల్లిస్తామని లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు. దీనికి తోడు ఫ్లాట్లు రద్దు చేసిన లబ్ధిదారుల డిపాజిట్ నగదు వెనక్కి ఇవ్వలేదు. ఇటీవల జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఫ్లాట్లు రద్దు చేసిన లబ్ధిదారులకు డిపాజిట్ సొమ్ము వెనక్కి ఇవ్వాలని టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి కోరారు.

ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద


స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

అనకాపల్లి టౌన్, మార్చి 9: స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రెండు రోజులుపాటు జరిగిన ఆరాధనోత్సవాలు శనివారంతో ముగిశాయి. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శనివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పీలాను సత్కరించారు. ఆలయం ద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ సంఘం ప్రతినిధులు కోసూరి మన్మథరావు, వానపల్లి కోటేశ్వరరావు, సింహాద్రి కోటేశ్వరరావు, ఎం.రామకృష్ణ, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు కోటిపల్లి జేజిబాబు, కొమ్మోజు రాజు పాల్గొన్నారు.

కొణతాలను మర్యాదపూర్వకంగా కలిసిన అనిత


కొణతాలను సత్కరించిన అనిత

అనకాపల్లి టౌన్, మార్చి 9 : స్థానిక టీచర్స్ కాలనీలోని కొణతాల క్యాంప్ కార్యాలయంలో టీడీపీ-జనసేన అనకాపల్లి నియోజకవర్గ అభ్యర్థి కొణతాల రామకృష్ణను తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత శనివారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణను అనిత సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

అనకాపల్లి టౌన్, మార్చి 9: పట్టణంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. శివరాత్రి సందర్భంగా భక్తులు శుక్రవారం రాత్రి పట్టణంలోని పలు ఆలయాలకు వెళ్లి దేవతా మూర్తులను దర్శించుకున్నారు. గౌరీ పంచాయతన ఆలయంలో ఓం నమః శివాయ పంచాక్షరి నామంతో అర్ధ ఏకాహం భక్తులు నిర్వహించారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో అర్ధరాత్రి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగలింగేశ్వరస్వామి, కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయాల్లో అర్ధరాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మకుమారీస్‌లు ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డులో మహాశివరాత్రి సందర్భంగా మహాశివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశాఖ సభను విజయవంతం చేయండి

» కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంగాధర్


గంగాధర్‌ను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

అనకాపల్లి టౌన్, మార్చి 9 : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15వ తేదీన విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగసభను ఉత్తరాంధ్ర ప్రజలు విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐ.ఆర్. గంగాధర్ పిలుపునిచ్చారు. శనివారం గాంధీనగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విశాఖలో జరిగే బహిరంగసభకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, ఉత్తరాంధ్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రాకేష్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం దేశంలో ఉన్న భారీ పరిశ్రమలను దశల వారీగా కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. ఆంధ్రాలో ఇప్పటికే గంగవరం పోర్టును కారుచౌకగా అదానీకి అమ్మేసిందన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులు కావడంతో పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో పార్టీ నాయకులు దాసరి సంతోష్, ఎస్. గజాలు, ఎగ్గాడ భాస్కరరావు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


సత్యవరంలో శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి 9: మండలంలోని సత్యవరం ఉమారామలింగేశ్వరస్వామి, గోపాలపట్నం సీతమ్మవారి కొండపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామి ఆలయాల్లో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యవరంలోని ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయం వద్ద శివరాత్రికి భక్తులు జాగారం చేయడంతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన చిన్న పిల్లల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఆంజనేయ విగ్రహం వద్ద దీపాలంకరణ



ఎలమంచిలి, మార్చి 9: మునిసిపాలిటీలోని రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద కాలనీ వాసులంతా సమిష్టిగా ఏర్పాటు చేసిన దీపాలంకరణ కన్నుల పండువగా దర్శనమిచ్చింది. మహాశివరాత్రికి కాలనీవాసులు జాగారం అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద దీపాలంకరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

కూండ్రంలో గడ్డికుప్ప దగ్ధం

కొత్తూరు, మార్చి 9 : మండలంలోని కూండ్రంలో పొలాల్లో ఉన్న గడ్డి కుప్ప దగ్ధమైంది. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి ఎవరో కాల్చిన సిగరెట్‌ను పడేసి ఉంటారని రైతు జామి ఈశ్వరరావు అనుమానం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ కాలనీ శివారులో ఉన్న చేనును ఆనుకొని గడ్డికుప్ప పక్కనే పాడి పశువుల పాక ఉందని, వెంటనే తాము చూసి నీటితో మంటలను ఆర్పివేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని రైతు తెలిపారు. దీని వల్ల రూ.15వేలు నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు.

చోడవరంలో కేంద్ర బలగాలు ఫ్లాగ్ మార్చ్


చోడవరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఎన్నికల విధులు నిమిత్తం విచ్చేసిన కేంద్ర బలగాలు శనివారం చోడవరం పట్టణంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కొత్తూరు జంక్షన్ నుంచి గాంధీగ్రామం వరకూ ప్రధాన రహదారిపై ఫ్లాగ్‌మార్చ్ జరిపారు. అత్యాధునిక ఆయుధాలు ధరించి ఉన్న వీరిని అంతా ఆశక్తిగా తిలకించారు.

- చోడవరం

గాంధీనగరంలో తాగు నీటి సమస్య

నాతవరం, మార్చి 9 : గాంధీనగరంలోని పంచాయతీ కార్యాలయం వద్దనున్న చేతిపంపు నుంచి నెల రోజులుగా నీరు ఎర్రని రంగులో వస్తోందని అక్కడి మహిళలు తెలిపారు. తాగడానికి వీలులేని విధంగా నీరు ఉంటుండడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. అసలే రానున్నది వేసవి కాలమని, ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని వారంతా కోరుతున్నారు.

కలిసికట్టుగా...

... 5వ పేజీ తరువాయి

ఇవ్వాలని బీజేపీ కోరినట్టు, అలాగైతే జనసేనకు అనుకున్న అనకాపల్లి లోక్‌సభ స్థానాన్ని బీజేపీకి బదిలీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ అలా జరిగితే అనకాపల్లి నుంచి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథ రాజు, సీఎం రమేశ్‌ల పేర్లు పరిశీలిస్తున్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అలాగే ఆ ప్రాంతంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవీఆర్) పేరు కూడా బీజేపీ అధిష్ఠానం పరిశీలనలో ఉందని ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి స్థానానికి మొదట జనసేన తరఫున నాగబాబు పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఆయన కూడా నియోజకవర్గంలో తిరిగారు. ఎందుకనో ప్రచారం ఆపేశారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి ఎంపీ స్థానం బీజేపీకి ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే అంటున్నారు.

అసెంబ్లీ స్థానాల సర్దుబాటు

ఉమ్మడి విశాఖ జిల్లాలో 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా బీజేపీతో పొత్తు కుదరక ముందే అందులో జనసేన పార్టీకి నాలుగు ఇచ్చారు. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి/మాడుగుల స్థానాలు కేటాయించారు. అక్కడ అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయిపోయినట్టే. అనకాపల్లికి కొణతాల రామకృష్ణ, ఎలమంచిలికి సుందరపు విజయకుమార్, పెందుర్తి పంచకర్ల రమేశ్‌బాబు పేర్లు ఖరారయ్యాయి. విశాఖ జిల్లాకు వచ్చేసరికి దక్షిణం సీటు జనసేనకు ఇచ్చారు. అక్కడి నుంచి ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు బీజేపీ కూడా కొన్ని అసెంబ్లీ స్థానాలు కోరుతోంది. గతంలో 2014లో టీడీపీ, బీజేపీ కలిసి పోటీ చేసినప్పుడు విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి విష్ణుకుమార్‌రాజు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత 2019 ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు మళ్లీ పోటీ చేయడానికి ప్రచారం కూడా ప్రారంభించారు. ఉమ్మడి విశాఖలో బీజేపీకి ఏమైనా అసెంబ్లీ స్థానాలు ఇచ్చినట్టయితే అందులో మొదటిది విశాఖ ఉత్తర నియోజకవర్గమే అవుతుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. బీజేపీలో రాష్ట్ర కోశాధికారి ఎం.నాగేంద్ర, నగర పార్టీ అధ్యక్షులు మేడపాటి రవీంద్ర, అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్, బీజేపీ యువమోర్చా నాయకుడు సురేంద్రమోహన్ వంటివారు ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నారు. ఇంకా ఏమైనా అదనంగా అసెంబ్లీ స్థానాలు కేటాయిస్తే వారిలో ఎవరికైనా ఛాన్స్ దక్కవచ్చు.

అసంపూర్తి ఇళ్లు అప్పగింత!

... 5వ పేజీ తరువాయి

తాళాలు అప్పగించారు. మిగిలి 130 మందికి కూడా తాళాలు అప్పగించే పనిలో కౌన్సిలర్లు ఉన్నారు.

366 మంది పరిస్థితి ఏమిటో?

1,296 ఫ్లాట్లుకు గాను 920కి బ్యాంకు రుణాలు మంజూరు అయ్యాయి. మిగిలిన 376 మందిలో పది మంది లబ్ధిదారులు బ్యాంకు రుణాలతో సంబంధం లేకుండా యూనిట్ ధర సొమ్ము ఒకేసారి కట్టుకోవడానికి ముందు వచ్చారు. ఈ పది మంది పోగా మిలిగిన 366 మంది లబ్ధిదారులలో సిబిల్ స్కోర్ సమస్య, 60 ఏళ్ల పైబడిన లబ్ధిదారులు, స్పందించనివారు ఉన్నారు. 60 ఏళ్ల పైబడిన లబ్ధిదారుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను లబ్ధిదారులుగా చేర్చడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. వీరిలో చాలా మంది లబ్ధిదారులు పేర్లు జాబితాలో ఉన్నాయి గాని ఇళ్ల తీసుకోవడానికి ముందుకు లేదని అధికారులు అంటున్నారు.

మౌలిక సదుపాయాలు శూన్యం

టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసినప్పటికీ వాటర్ ట్యాంక్, రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు పూర్తి కాలేదు. కొత్త బయపురెడ్డిపాలెం- కసిమి రోడ్డులోని టిడ్కో గృహాల వద్ద రోడ్లు, డ్రైనేజీ పనులు చాలా వరకు పూర్తి చేశారు. ఇక్కడ ప్రధాన రహదారిని కలుపుతూ అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్, విద్యుత్, వాటర్ ట్యాంక్ సదుపాయాలు కల్పించాలి. బలిఘట్టంలోని టిడ్కో గృహాల వద్ద రోడ్ల నిర్మాణాలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం విద్యుత్ స్తంభాలు వేస్తున్నారు. మురుగునీటి శుద్ధి ప్లాంట్, వాటర్ ట్యాంకు పనులు పూర్తి కాలేదు.

వడ్డీలు కట్టాలని లబ్ధిదారులపై ఒత్తిడి

టిడ్కో గృహాల నిర్మాణ పనులు నత్తనడకన సాగడం లబ్ధిదారులకు శాపంగా మారింది. బ్యాంక్ రుణాలు మంజూరు అయిన లబ్ధిదారులు వాయిదాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. రెండేళ్ల మారిటోరియం కాల వ్యవధి పూర్తి కావడంతో లబ్ధిదారులు వడ్డీలు చెల్లించాలని అంటున్నారు. ఒక్కొక్కరికి రూ.30 వేలు నుంచి రూ.40 వేలు వరకు వడ్డీలు పేరుకుపోయాయి. ఇళ్ల తాళాలు తీసుకుంటున్న లబ్ధిదారులు బ్యాంకులకు వడ్డీలు కట్టాల్సి రావడంతో ఇంతకాలం ఇళ్లు అప్పగించకుండా బ్యాంకు రుణాలు వాయిదాలు చెల్లించమంటే తామెందుకు చెల్లిస్తామని లబ్ధిదారులు అధికారులను నిలదీస్తున్నారు. దీనికి తోడు ఫ్లాట్లు రద్దు చేసిన లబ్ధిదారుల డిపాజిట్ నగదు వెనక్కి ఇవ్వలేదు. ఇటీవల జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఫ్లాట్లు రద్దు చేసిన లబ్ధిదారులకు డిపాజిట్ సొమ్ము వెనక్కి ఇవ్వాలని టీడీపీ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి కోరారు.

భక్త జన'వాహిని'

- శివరాత్రి జాగరణ అనంతరం పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్తులు
- శివనామ స్మరణతో మార్మోగిన పరిసరాలు
- బ్రహ్మలింగేశ్వరస్వామికి విశేష పూజలు
- గొలుగొండ మండలం ధారమఠం
- నాతవరం మండలం చమ్మచింతలోనూ కోలాహలం


గొలుగొండ : ధారమఠంలో ఉమాధారమల్లేశ్వర స్వామికి పంచామృతాలతో అభిషేకం


బలిఘట్టంలోని ఉత్తరవాహినిలో పుణ్య స్నానాలకు భారీగా తరలి వచ్చిన భక్తజనం



బుచ్చెయ్యపేట : పెదపూడి పోతురాజుకు టీడీపీ నేతల పూజలు గొలుగొండ మండలం కొంగసింగిలో...


నర్సీపట్నంలోని బలిఘట్టంలో బ్రహ్మలింగేశ్వరస్వామికి అర్చకుల అభిషేకం


దేవరాపల్లి : తిమిరాం శివాలయంలో...

నర్సీపట్నం, మార్చి 9 : మహా శివరాత్రి జాగరణ చేసిన భక్తులు పుణ్యస్నానాలకు భారీగా తరలి రావడంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో గల నదులు, రిజర్వాయర్లు, గెడ్డలు కోలాహలంగా మారాయి. శివరాత్రికి రోజంతా ఉపవాసం, రాత్రి జాగరణ చేసిన భక్తులు శనివారం వేకువజామున నర్సీపట్నం బలిఘట్టంలోని ఉత్తరవాహినికి తరలి వచ్చారు. దీంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. తొలుత పలువురు అర్చకులు, బుడగ జంగాలతో పితృదేవతలను స్మరించుకున్నారు. అనంతరం ఉత్తర వాహినిలో స్నానాలు ఆచరించి త్రిశూల పర్వత శ్రేణిపై కొలువై ఉన్న బ్రహ్మలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మహిళలు ధ్వజ స్తంభం వద్ద దీపారాధన చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆలయ ప్రాంగణం భక్తులతో రద్దీగా మారింది. గంటల తరబడి క్యూలైన్‌లలో ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ శెట్టి చినబాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. దత్తాత్రేయ ఆశ్రమం, పాకలపాటి గురుదేవుల ఆశ్రమంలో భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ నిత్యాన్నదానం ట్రస్ట్, నర్సీపట్నం గౌరీ యూత్, సత్యసాయి సేవా సమితి,శాంతి దుర్గా ఏజెన్సీ వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. పట్టణ పోలీసులు ఉత్తరవాహిని వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : ప్రముఖ పుణ్య క్షేత్రం మండలంలోని పాతమల్లంపేటలో గల ఉమాధారమల్లేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. శివరాత్రికి జాగరణ ఉన్న భక్తులు ఇక్కడి జలపాతంలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. కొందరు శుక్రవారం రాత్రంతా ఇక్కడే ఉండి శివనామస్మరణ చేయడంతో పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. అనంతరం శనివారం స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. అలాగే, ఏఎల్‌పురం నీలకంఠేశ్వర, కొంగశింగి శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, మాజీ సర్పంచ్ చెల్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని చమ్మచింతలో గల రామాలింగేశ్వరస్వామి, సిద్ధపట్నంలో గల దుర్గామల్లేశ్వరస్వామి, బుచ్చింపేటలోని శివాలయాలకు భక్తులు శనివారం పోటెత్తారు. శివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి జాగరణ చేసిన అనంతరం పుణ్యస్నానాల అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

బుచ్చెయ్యపేట : మహా శివరాత్రి వేడుకల్లో భాగంగా పెదపూడి పోతురాజు ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. చోడవరం, నర్సీపట్నం, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి వేలాదిగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. టీడీపీ నాయకులు బత్తుల తాతయ్యబాబు, కేవీఎస్ఎన్.రాజు, గునూరు మల్లునాయుడు, గోకివాడ కోటేశ్వరరావు, రాము, వియ్యపు అప్పారావు తదితరులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరాపల్లి : శివరాత్రి వేడుకల్లో భాగంగా రెండో రోజు కూడా శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం రాత్రి జాగరణ చేసిన భక్తులంతా శనివారం ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో గల గెడ్డలు, చెరువుల్లో స్నానాలు ఆచరించి దేవరాపల్లి వనదేవీశ్వర ఆలయం, ఉమామహేశ్వరీదేవీ ఆలయం, చిననందిపల్లి, పెదనందిపల్లి, బి.కింతాడ, కలిగొట్ల, తెనుగుపూడి, కొత్త పెంట, తిమిరాం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారిని దర్శించుకున్నారు.

కె.కోటపాడు : శివరాత్రి జాగరణ చేసిన భక్తులు శనివారం ఉదయం శివాలయాలకు వెళ్లి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో ఆయా ఆలయాలు భక్తులతో కోలాహలంగా కనిపించాయి. మండలంలోని సింగన్నదొరపాలెం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయానికి మరింత పోటెత్తారు. ఆర్లి గ్రామంలోని స్వయంభూ శివాలయంలో రుద్రాభిషేకాలు జరిపారు.

ఎన్నికలు ముగిసే వరకు సైనికుల్లా పనిచేయండి

- టీడీపీ శ్రేణులకు మాజీ మంత్రి అయ్యన్న పిలుపు
- నాతవరం శంఖారవం సభలో తన హయాంలో చేపట్టిన అభివృద్ధి వివరణ


నాతవరం ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నాతవరం, మార్చి 9 : సార్వత్రిక ఎన్నికలు ముగిసే వరకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రం నాతవరంలో శనివారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని, ఈ పరిస్థితుల్లో ఆంధ్ర అభివృద్ధి చెందాలన్నా.. ప్రజల కష్టాలు తొలగాలన్నా. సమర్థుడైన చంద్రబాబువంటి నాయకుడు అవసరమన్నారు. పంచాయతీరాజ్ శాఖా మంత్రిగా తాను ఉన్నప్పుడు నాతవరంలో రూ.22 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్, బంగారు గెడ్డపై వంతెన, సంపద కేంద్రం తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్టు వివరించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను అధిక మెజార్టీతో గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి పనులు చేపడతానన్నారు. గత ఎన్నికల్లో వైసీపీని ఆదరిస్తే గ్రామాల అభివృద్ధి ఎంత దారుణంగా ఉందో ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. నాతవరం పశు వైద్యకేంద్రాన్ని ప్రారంభించి నిరుపయోగంగా వదలివేశారని ఎద్దేవా చేశారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని చట్టపరంగా ఎదుర్కొంటామన్నారు. రాష్ట్రంలో 30 లక్షల ఇళ్లు కట్టడం జరిగిందని చెపుతున్నారని, కానీ ఏడు లక్షలకు మించి ఇళ్లు కట్టలేదన్నారు. జగన్ అసమర్థ పాలన వల్ల రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడిపోయిందన్నారు. మాజీ జడ్పీటీసీ కరక సత్యనారాయణ మాట్లాడుతూ పంచాయతీ రాజ్ శాఖా మంత్రిగా అయ్యన్నపాత్రుడు ఉన్నప్పుడు నాతవరం మండలంలో రూ.650 కోట్ల అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం రెండు నెలలైనా రైతులకు ధాన్యం డబ్బులు అందని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రైతు భరోసా కేంద్రాలు రైతు దగా కేంద్రాలుగా మారాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ లాలం అచ్చిరాజు, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ కొండబాబు, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్, ఎస్.సన్యాసిదేముడు, నాయకులు అప్పిరెడ్డి మాణిక్యం, జీరెడ్డి రాజుబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, మండల తెలుగు యువత అధ్యక్షుడు శెట్టి లోవ, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంద్రు మరిడియ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు శెట్టి నానాజీ, మండల తెలుగు రైతు అధ్యక్షుడు పైల సూరిబాబు, పారుపల్లి వెంకటరమణలతో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'కలలకు రెక్కలు పథకంతో బాలికల విద్యకు భరోసా'



విలేకరులతో మాట్లాడుతున్న తాతయ్యబాబు.., రమణమ్మ

బుచ్చెయ్యపేట, మార్చి 9 : మహిళా వికాసానికి ఆది నుంచి తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తున్నట్టు టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతాయ్యబాబు తెలిపారు. శనివారం వడ్డాదిలో విలేకరులతో మాట్లాడుతూ ఆడబిడ్డలకు ప్రత్యేకంగా టీడీపీ 'కలలకు రెక్కలు' పథకాన్ని ప్రవేశపెట్టనుందన్నారు. ఇది యువతుల్లో ఉన్నత విద్యాభివృద్ధి దోహదపడగలదన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రొఫెషనల్ కోర్సులు నేర్చుకునే విద్యార్థినులకు ప్రభుత్వ గ్యారెంటీతో బ్యాంకు రుణాలు ఇప్పించడంతో పాటు రుణాలకు వడ్డీ కూడా పూర్తిగా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఈ పథకం అమలులోకి రానుందన్నారు. మహిళలంటే సమాజంలో జనాభాగా మాత్రమే జగన్‌రెడ్డి సర్కారు భావిస్తుండగా, టీడీపీ మాత్రం అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డల కోసం రాక్షసులతో పొరాడుతున్న టీడీపీ, జనసేన సంయుక్త కూటమికి ప్రజంతా అండగా నిలిచి, రానున్న ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాల్సిందిగా ఆయన కోరారు.

నర్సీపట్నం అర్బన్ : మహిళా దినోత్సవం సందర్భంగా టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరిలు రాష్ట్రంలోని ఆడ పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కలలకు రెక్కలు పథకాన్ని ప్రవేశపెట్టడం ఆనందదాయకమని జడ్పీటీసీ సుకల రమణమ్మ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆమె ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మహిళా వికాసానికి తెలుగుదేశం పార్టీ ఆదినుంచి అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఇందులో భాగంగానే డ్వాకా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ సమావేశంలో పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

ఎం.కోడూరులో ఉచిత వైద్య శిబిరం


మహిళకు పరీక్ష జరుపుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

మాడుగుల రూరల్, మార్చి 9 : ఎం.కోడూరులో ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యులు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు మూడు వందల మందిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం హోమియో వైద్యంపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భజన పోటీల్లో ధర్మసాగరం బృందం విజేత

రోలుగుంట, మార్చి 9 : కుసర్లపూడిలోని గురుదేవుల ఆశ్రమం వద్ద శివరాత్రి మహోత్సవం సందర్భంగా నిర్వహించిన భజన పోటీలు శనివారంతో ముగిశాయి. మాజీ సర్పంచ్ గండి సింహాద్రి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో పలు గ్రామాల నుంచి ఇరవై భజన బృందాలు పాల్గొన్నాయి. ధర్మసాగరం భజన బృందం ప్రథమ స్థానంలో నిలిచింది.

మరిడిమాంబకు టీడీపీ శ్రేణులు పూజలు


మరిడిమాంబకు పూజలు చేస్తున్న నాయకులు

చీడికాడ, మార్చి 9 : రాష్ట్రంలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించాలని కోరుతూ దండిసురవరంలోని మరిడిమాంబ ఆలయంలో ఆ పార్టీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బాది తాతారావు ఆధ్వర్యంలో గ్రామ మాజీ సర్పంచ్ వేపాడ నాగేశ్వరరావు, వెచ్చం భీమరాజు, కోన అప్పారావు తదితరులు రాష్ట్రానికి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, ప్రజలందరి భవిష్యత్తు బాగుండాలని వేడుకున్నారు.

రెండు గ్రామాల్లో జానకిలమ్మ పండగ

గొలుగొండ, మార్చి 9 : మండలంలోని కొత్తమల్లంపేట, చిన్నయ్యపాలెం గ్రామాల్లో శనివారం జానకిలమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు ఆధ్వర్యంలో కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుల్లిపల్లిలో సీతారాముల తీర్థం


ఆలయంలో పూజలు

కె.కోటపాడు, మార్చి 9 : గుల్లిపల్లి గ్రామంలో సీతారాముల వారి తీర్థం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువజాము నుంచి పూజలు నిర్వహించారు. సర్పంచ్ బండారు దేముళ్ళు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

20 నుంచి దేవిపెద్దింటమ్మ జాతర



రోలుగుంట, మార్చి 9 : మండలంలోని కుసర్లపూడిలో ఈ నెల 20న దేవి పెద్దింటమ్మ జాతర ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్టు గ్రామ సర్పంచ్ మడ్డు అప్పలనాయుడు తెలిపారు. ఐదు రోజుల పాటు ఈ వేడుక జరగనుందన్నారు. ప్రతిరోజూ పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

గ్రామాల్లో నూతన బోర్లు ఏర్పాటు

మాకవరపాలెం,మార్చి 9 : అడిగర్లపాలెం, మామిడిపాలెం, పోతలూరులలో బోర్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. మండల పరిషత్ నుంచి ఈ బోర్లు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. దీంతో బోర్ల తవ్వకం పనులు ఎంపీటీసీ రుత్తల సత్యవతి ప్రారంభించారు. మామిడిపాలెం సర్పంచ్ బుద్దా రమణ, ఉప సర్పంచ్ అడిగర్ల సింహాచలం, వైసీపీ నాయకులు రుత్తల రాజబాబు పాల్గొన్నారు.

చీడికాడలో ఇళ్ల పట్టాలు పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చీడికాడ, మార్చి 9 : మండల కేంద్రం చీడికాడలో 28మంది ఇళ్ల లబ్ధిదారులకు సంబంధించి రిజిస్ట్రేషన్ పత్రాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఆర్వో చలుగు సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడ 81 మందికి ఇళ్ల పట్టాలు మంజూరుకాగా, ప్రస్తుతం రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి సచివాలయంలో పట్టాలు అందించామన్నారు. నాయకులు పరవాడ మహేష్, సిరిసోళ్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మండే ఎండల్లో వరుణుడి పలకరింపు


చోడవరం శివారు లక్ష్మీపురం కళ్లాల వద్ద వర్షం కురుస్తున్న దృశ్యం

చోడవరం, మార్చి 9 : వాతావరణంలో మార్పుల కారణంగా మండలంలో శనివారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత కొనసాగినప్పటికీ మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమైంది. చల్ల గాలులు ప్రారంభమై అనంతరం ఇరవై నిమిషాల పాటు వర్షం పడింది. దీంతో అంతటా ఒక్కసారిగా చల్లబడింది. ఇదిలావుంటే, కాలం కాని కాలంలో వర్షం కురవడంతో పలువురు ఆశ్చర్యంతో పాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే జీడి, మామిడి రైతులు మాత్రం వర్షం ప్రభావం ఆయా పంటలపై ఏ మేరకు ప్రభావం చూపనుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చీడికాడ మండలంలో...

చీడికాడ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమై సుమారు గంటపాడు ఏకధాటిగా పడింది. దీంతో పెదగోగాడ, వరహా పురం తదితర గ్రామాల్లో ఎక్కడ చూసినా నీరే కనిపించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం పలు పంటలకు ఉపకరిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ అప్పలనాయుడు


కాంప్లెక్స్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న డీసీటీ మేనేజర్

చోడవరం, మార్చి 9 : ప్రయాణికులకు మెరుగైన సేవలతో పాటు, ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అనకాపల్లి ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి. అప్పలనాయుడు సిబ్బందికి సూచించారు. శనివారం ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆయన తనిఖీలు నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా కళ్యాణపులోవ, విశాఖ ఆర్‌కే బీచ్, అప్పికొండ ప్రాంతాలకు నడుస్తున్న ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారు ఆర్టీసీ బస్ స్టేషన్లలో పార్శిల్ పాయింట్లను, కార్గో ద్వారా పార్శిల్ సర్వీసులను కూడా సద్వినియోగం చేసుకునేలా చైతన్యం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.